హరిత యజ్ఞం


జగద్గిరిగుట్టలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, జోనల్ కమిషనర్ మమత


పేట్‌బషీరాబాద్ ఠాణా ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న సీఐ ప్రశాంత్, మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, ఏసీపీ రామలింగరాజు


నీళ్లు పోస్తున్న చైర్మన్ శ్రీశైలం యాదవ్, కమిషనర్ శ్రీహరి

వాడవాడలా తెలంగాణ హరితోత్సవం

రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ఒక యజ్ఞంలా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 'తెలంగాణ హరితోత్సవం' కార్యక్రమాన్ని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించారు. అధికారులు ఆయా కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు ఆయా డివిజన్లు, వార్డుల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. జగద్గిరిగుట్ట డంపింగ్‌యార్డును తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ దశాబ్ది నర్సరీ'ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జోనల్ కమిషనర్ మమత కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీ ప్రశాంతి, హార్టికల్చర్ డీడీ పద్మనాభ, సర్కిల్ మేనేజర్ విజయ రాణి, శానిటేషన్ డీఈఈ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్


మేడ్చల్ ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న జిల్లా రవాణా అధికారి కిషన్


దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో మొక్కలు నాటుతూ..


మొక్కకు నీళ్లు పోస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టింగ్ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గోదావరి హోమ్స్, గాయత్రినగర్, టీఎస్ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బచ్‌పన్‌లో ఫాదర్స్ డే



కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో సోమవారం ఫాదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తమ తల్లిదండ్రుల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. కుటుంబ పెద్దగా తండ్రి ఔన్నత్యాన్ని, తండ్రి పట్ల వారికున్న గౌరవాన్ని చిన్నారులు చిత్రలేఖనం ద్వారా తమ భావాలను వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

సుభాష్‌నగర్: వీధుల్లో మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కృషికాలనీ మాజీ ప్రెసిడెంట్ పాషా అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌చైర్మన్ పద్మారావు

సుభాష్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని దుండిగల్ వైస్‌చైర్మన్ పద్మారావు అన్నారు. సోమవారం బహదూర్‌పల్లిలోని 14వ వార్డులో రూ.47 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ లైన్ (యూజీడీ) పనులకు ఆయన కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లుగారి సత్యనారాయణ, భారత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, మల్లేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, వార్డు అధ్యక్షుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి లీకేజీకి మరమ్మతులు

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ – గాజులరామారం ప్రధాన రోడ్డులోని సంజయ్ గాంధీనగర్ వద్ద రోడ్డుపై పారుతున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐదు రోజుల నుంచి లీకేజీతో నీరు రోడ్డుపై పారుతుండటంతో పెద్ద గొయ్యి ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఈనెల 18న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం వాటర్‌వర్క్స్ డీఈ అప్పలనాయుడు, ఏఈ రమ్య, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి, జీడిమెట్ల డిపో మేనేజర్ విజయకుమార్ అక్కడికి చేరుకొని సమస్యను పరిశీలించారు. ప్రధాన మంచి నీటి పైప్‌లైన్ పగిలిందని గుర్తించారు. 24గంటల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అప్పటి వరకు అర కిలోమీటర్ వరకు వన్ వేలో వాహనాలకు పంపించారు.


సంజయ్‌గాంధీనగర్‌లో లీకేజీని పరిశీలిస్తున్న జలమండలి, ట్రాఫిక్ అధికారులు

ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలల నిర్వహణ

ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాధికారి ఆంజనేయులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట వారి జేబులు గుల్ల చేస్తున్నాయని ఆరోపించారు. చాలా వరకు పాఠశాలలకు గుర్తింపు ఉండటం లేదన్నారు. ఇలాంటి జాబితాలో మల్లారెడ్డినగర్‌లో ఇన్‌స్పైర్ ఫౌండేషన్ స్కూల్, యూరో కిడ్స్, గాజులరామారంలో స్మార్ట్ కిడ్స్ జూనియర్ స్కూల్, మహదేవపురంలోని ఫన్నీ బీస్, లోటస్ ప్లే స్కూల్, కీడ్జీ ప్లే స్కూళ్ల వంటివి అనేకమున్నాయని పేర్కొన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏవీబీపీ నాయకులు షణ్ముఖ్, చింతల్ నగర కార్యదర్శి మృత్యుంజయ, జగదీష్, జానకిరామ్, అవినాష్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంఈవో ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న ఏవీబీపీ నాయకులు

సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి పాటు పడాలి

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం అధ్యక్షుడు ఉప్పల హరివేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే కాలనీ అభివృద్ధికి తన సహాయసహకారాలు ఉంటాయన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాజేష్, ప్రవీణ్‌కుమార్, నానిబాబు, సంయుక్త కార్యదర్శులు సురేష్, కృష్ణారావు, కన్నప్ప, కోశాధికారి భరత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు



హర్యానా గవర్నర్‌ను కలిసిన కుత్బుల్లాపూర్ బీజేపీ నేతలు

చింతల్: ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ నేతృత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓబీసీ నాయకులు ఢిల్లీ దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు.

యోగాసన.. 2500 మందికి శిక్షణ

నిజాంపేట్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో జిజ్ఞాస టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా అవగాహన శిబిరాలు నిర్వహించారు. నిజాంపేట్ విజ్ఞాన్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా యోగా, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్స, ప్రాచీన హిందూ గ్రంథాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ యోగా శిక్షణ కార్యక్రమంలో సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిజ్ఞాస రాష్ట్ర కన్వీనర్ ఎన్.నితీష్‌రెడ్డి, కో కన్వీనర్ డాక్టర్ శ్రీజారెడ్డి, సహా ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు ప్రకృతి వైద్య కళాశాల వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


నిజాంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో జిజ్ఞాస సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నల్లా, విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత బీఆర్ఎస్‌దే..


భరోసా యాత్రలో సమస్యలు వింటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

చింతల్: ఇంటి పన్నులతో పాటు నల్లా, విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ‘కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా’ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్ఎల్‌బీ నగర్, పద్మశాలి బస్తీ, వివేకానంద్ నగర్, శ్రీనివాస్ నగర్ బస్తీల్లో ఆయన పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేసిన డ్రైనేజీ లైన్‌లు, రోడ్లే ఇప్పటికి దర్శనమిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వివేకానంద్ చేసిందేమీ లేదన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం కావాలంటే బీజేపీ ప్రభుత్వం రావాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందం, డివిజన్ ఇన్‌చార్జులు బిల్లా వెంకటేష్, సుకాంత్‌గౌడ్, బస్తీల నాయకులు అఖిల్ సాయి, పాలకుమార్, నరేందర్ సింగ్, సాయిరామ్‌రెడ్డి, రాజేష్‌చారి, జగదీష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కోల్పోయిన రిజర్వేషన్లను తిరిగి సాధిద్దాం

శెట్టి బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

చింతల్: తెలంగాణ రాష్ట్రంలో శెట్టి బలిజ కులస్తులు కోల్పోయిన రిజర్వేషన్లను తిరిగి సాధించడానికి ఐక్యంగా పోరాడాలని శెట్టి బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కండిబోయిన శ్రీనివాస్ అన్నారు. సోమవారం హెచ్ఎంటీలోని హరిహర కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్లు కోల్పోయిన 26 కులాలతో కలిసి హైదరాబాద్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నామని సంఘం నాయకులు తెలిపారు. రిజర్వేషన్లు తొలగించడంతో వెనుకబడిన కులాలకు చెందిన తాము ఎంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, దంపనబోయిన శ్రీనివాస్, రమేష్, ప్రసాద్, ఇతర కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

రంగు రాజమ్మ సేవా సమితి నూతన కార్యవర్గం

రంగారెడ్డినగర్: సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్న ‘రంగు రాజమ్మ సేవా సమితి’ జనరల్ బాడీ సమావేశం కుత్బుల్లాపూర్‌లో సోమవారం నిర్వహించారు. రిజిస్టర్ నంబర్ 1260/2009 ప్రకారం గతంలో కార్యవర్గం కొనసాగుతుండగా స్వల్ప మార్పులు చేసి పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రంగు శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా రంగు భార్గవి, కోశాధికారిగా కవిత, కార్యవర్గ సభ్యులుగా భార్గవి, రాజేశ్వరి, షణ్ముఖ శ్రీలను ఎన్నుకున్నారు. 2009 నుంచి రంగు రాజమ్మ సేవా సమితి సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. రాబోయే రోజుల్లో సైతం ప్రజా అవసరాలకు అనుగుణంగా పని చేస్తామని కొత్త కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

దళితులపై దాడి అమానుషం

నిజాంపేట్: మూఢనమ్మకాల పేరుతో దళిత బలహీన వర్గాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కోల్కూర్ గ్రామంలో బాణామతి చేస్తున్నారనే నెపంతో యాదయ్య, శ్యామలను గ్రామపంచాయతీ వద్ద తలకిందుల కట్టేసి అత్యంత కిరాతకంగా దాడికి పూనుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సభ్య సమాజం ఖండించాలన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను విడిపించి అక్కడ నుంచి తరలిచారన్నారు. మూఢనమ్మకాల పేరుతో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాలపీరు కోరారు.

మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

దుండిగల్: ప్రస్తుత కాలంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎన్నో అద్భుత విజయాలు సాధిస్తున్నారని అభిహారా సోషల్ ఎంటర్‌ప్రైజ్ సీఈఓ సుధారాణి ముళ్లపుడి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. మూడు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ... ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలు విజ్ఞానం, నెటవర్క్, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇది చక్కటి వేదికగా నిలిచిందన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ... మూడు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మార్కెట్ విశ్లేషణ, ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్ వ్యూహాలు తదితర అనేక రకాల అంశాలను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ మర్రి మమతారెడ్డి, డైరెక్టర్ అను శ్రేయారెడ్డి, డీన్ డాక్టర్ రాధిక, బలరాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఎల్ఆర్ఐటీలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుధారాణి

గల్లీ లీడర్.. బ్లాక్ మెయిల్‌కు కేరాఫ్ అడ్రస్

బెంబేలెత్తి పోతున్న నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు

కుత్బుల్లాపూర్: కబ్జాదారులకు బెదిరింపులు.. అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ ఓ పార్టీ గల్లీ లీడర్ గాజులరామారం ఏరియాలో హల్‌చల్ చేస్తున్నాడు. ఇప్పటికే ఇతగాడిపై ఆ పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినా పద్ధతి మార్చుకోకుండా అధికారులపై ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ రెచ్చిపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. కైసర్‌నగర్‌కు చెందిన ఈ గల్లీ లీడర్ గత కొంతకాలంగా దేవేందర్‌నగర్, రావి నారాయణరెడ్డినగర్, కైసర్ నగర్, గాజులరామారం ప్రాంతాల్లో ఇప్పటికే కబ్జాలు చేసి పోలీసు రికార్డుల్లో ఉన్న వారిని బెదిరిస్తూ అందిన కాడికి దండుకున్నాడు. తాజాగా అతని దృష్టి అధికారులపై పడడంతో ప్రతిరోజు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ స్థాయి అధికారులకు మెయిల్ చేస్తూ సోషల్ మీడియా ద్వారా బ్లాక్ మెయిలింగ్ పోస్టులు పెట్టడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

◆ ఇప్పటికే ప్రభుత్వ స్థలాల్లో భారీ అక్రమ నిర్మాణాలు చోటు చేసుకోగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు ఈ క్రమంలో ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డితో పాటు ముగ్గురు వీఆర్ఏలపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఇది ఆసరాగా చేసుకున్న ఈ గల్లీ లీడర్ ప్రతిరోజు ఏదో విధంగా వార్తల్లో ఉంటూ వస్తున్నాడు. మండల కార్యాలయం వద్ద తిష్ట వేస్తూ వచ్చేవారిని ఇబ్బందుల గురి చేయడమే కాకుండా అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న కిందిస్థాయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. చేయని తప్పుకు మమ్మల్ని బాధ్యతలు చేస్తూ ఇలా బదనాం చేయడంపై ఓ అధికారి స్థానికంగా ఉన్నా రాష్ట్రస్థాయి నాయకుడిని కలిసి ఈ గల్లీ లీడర్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ పార్టీ నాయకుడు ఆ గల్లీ లీడర్‌ను హెచ్చరించినట్లు తెలిసింది. ఏది ఏమైనా రెవెన్యూ అధికారులను టార్గెట్ చేస్తూ ఉన్నత అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న సదరు గల్లీ లీడర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సమస్యలకు పరిష్కారం

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకుండా తమ స్వలాభమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతోనే మార్పు వస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని.. వచ్చే ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణాలో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో పర్యటిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

బస్తీ నాలాకు.. పరిశ్రమ డ్రైనేజీ లైన్

- రసాయనాల వాసనతో ఇబ్బందులు తప్పవంటున్న స్థానికులు
- పారిశ్రామికవాడలోని నాలాకు కలపాలని డిమాండ్
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు


గురుమూర్తినగర్ రోడ్డును తవ్వి పైపులైన్ వేస్తున్న దృశ్యం

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడలోని నాలాకు అనుసంధానం చేయాల్సిన డ్రైనేజీ లైన్‌ను ఓ పరిశ్రమ యాజమాన్యం బస్తీ ప్రధాన నాలాలో కలపడం వివాదాస్పదంగా మారింది. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతం గురుమూర్తినగర్‌కు ఆనుకుని అకిన్ లేబొరేటరీస్ యాజమాన్యం ఇటీవల భవనాల నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో లేబొరేటరీస్‌కు చెందిన డ్రైనేజీ లైన్‌ను కలిపేందుకు గురుమూర్తినగర్‌కు వెళ్లే రోడ్డును తవ్వి బస్తీ డ్రైనేజీ లైన్‌కు పైపుల ద్వారా కలిపారు. దీనిపై గురుమూర్తినగర్ వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు నేరుగా బస్తీ డ్రైనేజీ పైపులైన్‌కు కలపడంతో రసాయనాల వాసనలతో తమకు ఇబ్బంది తప్పదంటున్నారు.

◆ గతంలో గాంధీనగర్‌లోని వీవీఎన్ పరిశ్రమ యాజమాన్యం ఇదే విధంగా రసాయనాలను విడుదల చేయడంతో డ్రైనేజీ లైన్‌లో మంటలు వ్యాపించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో డ్రైనేజీ లైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు బయటకు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పరిశ్రమల పైపులైన్‌లను కూడా బస్తీ లైన్‌కు కలపడంతో మున్ముందు సమస్య మరింత తీవ్రతరమవుతుందని పేర్కొంటున్నారు.

నిబంధనలు అతిక్రమించి రోడ్డు తవ్వకం..

రోడ్డుపై ఏదైనా పైపులైన్ వేసే క్రమంలో జీహెచ్ఎంసీ అధికారుల అనుమతి తప్పనిసరి. కాని అకిన్ లేబరేటరీస్ యాజమాన్యం ఇవేమీ పట్టించుకోకుండా గురుమూర్తినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును తవ్వి మరీ పైపులైన్ వేశారు. జీహెచ్ఎంసీ నిబంధనలు తమకు వర్తించవన్నట్లుగా పరిశ్రమ యాజమాన్యం వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై స్థానిక జీహెచ్ఎంసీ ఏఈ స్వాతిని సంప్రదించేందుకు ‘సాక్షి’ ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. బస్తీకి చెందిన డ్రైనేజీ లైన్‌కు పరిశ్రమ లైన్‌ను కలపడమే కాకుండా రోడ్డుపై అనుమతిలు లేకుండా తవ్వకాలు చేపట్టిన అకిన్ లేబొరేటరీస్ పరిశ్రమ యాజమాన్యంపై జీహెచ్ఎంసీ అధికారులు ఏ విధమైన చర్యలు చేపటడతారో వేచి చూడాలి.


గురుమూర్తినగర్‌ను ఆనుకుని ఉన్న అకిన్ లేబొరేటరీస్ పరిశ్రమ